క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలిసిన మండల నాయకులు



పులిచెర్ల(కల్లూరు): పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం ఆయన స్వగృహంలో మండల నాయకులు కలిశారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా, నాగరాజ ప్రసాద్, కలాం, ఆనంద, కృష్ణమూర్తి, అమర, షబ్బీర్, మక్బూల్ సాహెబ్, శీన తదితరులు ఉన్నారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం

పుంగనూరు: స్థానిక నగిరివీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రెండవ రోజు ధ్వజారోహణం నిర్వహించారు. అర్చకులు షణ్ముక దీక్షితులు శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పుంగనూరు: పట్టణంలోని చెరువు కట్టపై ఉన్న హజరత్ సయ్యద్ నూర్‌షావలి బాబా దర్గా వద్ద ఈ నెల 25న ఉరుసు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కరీముల్లా, నౌషాద్, సద్దాం, అయూబ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం కమిటీ సభ్యులు ఉరుసు పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 25న గంథం, 27న ఖవ్వాలి, 28న తహలీల్ ఫాతేహా నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లి: మండలంలోని ధర్మపురి పంచాయితీ మేకలనాగిరెడ్డిపల్లెలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. అలాగే సీతారాములు, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సర్పంచ్ బాలక్రిష్ణగౌడు, రోశేశ్వరగౌడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక



ఎంపికైన నూతన కార్యవర్గం

సదుం: మండల అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో దళితులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా లోకనాథం, గౌరవ సలహాదారునిగా చిన్న రెడ్డెప్ప, అధ్యక్షునిగా గిరిబాబు, ఉపాధ్యక్షులుగా తిరుమలేష్, శరత్ కుమార్, కార్యదర్శిగా రామాంజులు, కోశాధికారిగా వెంకటరత్నంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



వీ.కోట: జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

వి.కోట/పుంగనూరు/పులిచెర్ల(కల్లూరు)/శాంతిపురం: భారతీయ జనతా పార్టీ 46 ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం వీ.కోట, పుంగనూరు, పులిచెర్ల మండలం మతుకువారిపల్లె, కొత్తపేట, శాంతిపురం మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. వీ.కోటలో పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌కుమార్, పుంగనూరులో పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో వీ.కోట మండల అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు కవిత రాజు, నావికా, మాధవ్, మోహన్, రాజ్‌కుమార్, రమేష్, అయూబ్‌ఖాన్, పరమేష్, నానబాలకుమార్, మఠంబాబు, టీవీఎస్ ప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదాస్ లోకేష్, పులిచెర్ల శాఖ అధ్యక్షురాలు మొబీనా, గజేంద్ర, మునిరత్నం, శాంతిపురం బీజేపీ మండల అధ్యక్షుడు గజేంద్ర, నియోజకవర్గ కన్వీనర్ శివశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తులసీనాథ్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కాశీనాథశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.




కల్లూరులో..

రామ రామ.. జయ సీతా రామా..!

శ్రీరామ నవమి పురస్కరించుకుని పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తజన సందడి నడుమ కల్యాణోత్సవాలు నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నదానాలు చేశారు. కొన్ని చోట్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

- వాడవాడలా ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- రామనామ స్మరణతో ఆధ్యాత్మిక శోభ
- కనుల పండువగా కల్యాణోత్సవం



రొంపిచెర్ల: కన్యకా పరమేశ్వరి ఆలయంలో కల్యాణోత్సవం, పెద్దపంజాణి: విశేష అలంకరణలో సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, బైరెడ్డిపల్లెలో.., పులిచెర్ల(కల్లూరు): మతుకువారిపల్లెలో..

రొంపిచెర్ల: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తజన కోలాహలం నడుమ ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరస్వామి ఆలయం, శ్రీరాముగుడి, వడ్డేవాండ్లపల్లెలోని శ్రీరాముల గుడి, లోకవారిపల్లె శ్రీరాముల గుడి ఆలయాలలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో అర్చకుడు మునిరాజ శర్మ, ఆర్య వైశ్య మహిళలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కల్యాణోత్సవానికి శ్రీరాముడి తల్లిదండ్రులుగా వి. జయ ప్రకాష్, పద్మజ, సీతమ్మ తల్లిదండ్రులుగా సూర్యప్రకాష్, వాణి దంపతులు వ్యవహరించారు. అలాగే శ్రీరాములగుడి వీధిలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మునికృష్ణారెడ్డి, కిషోర్, బాలాజి, నరసింహులు, సుకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని కల్లూరు, మతుకువారిపల్లె, చెరువుముందరపల్లె, మంగళంపేట, పులిచెర్లలోని రామాలయాల్లో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మతుకువారిపల్లెలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. .

సదుంలో..

సదుం: మండలంలోని పచ్చార్లమాకులపల్లె, పెడకంటివారిపల్లె రామాలయాలలో పూజలు చేశారు.



వీ.కోట: స్వామి వారిదర్శనార్థం క్యూలో వెళ్తున్న భక్తులు

నడిగడ్డ మత్తుకువారిపల్లెలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక కాలేజీరోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో భజనలు, అన్నదానం చేశారు. చెన్నకేశవులస్వామి ఆలయంలోని రామాలయంలో పూజలు చేశారు. భక్తులకు వడపప్పు, పానకం పంచారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని బిల్లేరు వద్ద రామాలయంలో సీతారాముల ఉత్సవమూర్తులకు అర్చకుడు ఆనందాచార్యులు కల్యాణోత్సవం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు హాజరయ్యారు. కల్యాణోత్సవం అనంతరం అన్నదానం చేశారు.

పుంగనూరులో..

పుంగనూరు: హనుమంతురాయునిదిన్నెలోని ఆంజనేయస్వామి, సుబ్బమ్మ చెరువు వద్ద ఆంజనేయ స్వామికి, కట్టక్రిందపాళ్యెంలోని శ్రీకోదండరామ స్వామి, మార్లపల్లెలోని అభయాంజనేయస్వామి, అరవపల్లె వద్ద వీరాంజనేయస్వామి, హైస్కూల్‌వీధిలోని కోదండరామస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, స్వామివార్లకు వేకువజాము నుంచి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయాలలో రామకోటి నిర్వహించారు. భక్తుల రామనామస్మరణతో ఆప్రాంతాలు మార్మోగాయి. రాత్రి పారాయణం నిర్వహించారు. పానకం, మినప్పప్పు, మజ్జిగ పంపిణీతోపాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వీ.కోటలో..

వి.కోట: స్థానిక రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక, అభిషేకాలు పూజల అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అఖండ జ్యోతి, రామకోటి, కోలాట ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పానకం, వడపప్పు, మజ్జిగ, ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ సమేత వీరాంజనేయస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి, మంగళ వాయిద్యాల హోరు, కీలు బొమ్మల ప్రదర్శనల నడుమ కోలాహలంగా ఊరేగించారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలంలో రాయలపేటలోని కోదండరామస్వామి ఆలయంలో నవమి పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. సీతా రామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తులను హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక కోదండరామస్వామి ఆలయం, కార్వేటికొండపై ఉన్న ధ్యానాభిరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

శాంతిపురం మండలంలో..

శాంతిపురం: రాళ్లబూదుగూరు, చౌడంపల్లెలోని కోదండరామస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన మండపాలలో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి, అర్చక స్వాములు ఈ కార్యక్రమం నిర్వహించారు. రాళ్లబూదుగూరులోని ఆలయంలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకూ, చౌడంపల్లె రాత్రి 7 గంటల నుంచి కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలను అందజేశారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలో అనగర్లపల్లెలోని రామంజనేయస్వామి ఆలయంలో కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. సీత, శ్రీరాముడు, హనుమంతుని ఉత్సవ విగ్రహాలకు పట్టు వస్త్రాలతో ప్రత్యేక అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే, గ్రామాలలోని భజన మందిరాల్లోనూ రామ కోటి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు పెసర పప్పు, పానకం పంపిణీ చేశారు.




శాంతిపురం: రాళ్లబూదుగూరులో సీతాలక్ష్మణ సమేత కళ్యాణరామయ్య, గుడుపల్లె: అనగర్లపల్లెలో..







రొంపిచెర్ల: కన్యకా పరమేశ్వరి ఆలయంలో భక్తులు, రొంపిచెర్ల: శ్రీరాములగుడి వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు, సదుం: పూజల్లో పాల్గొన్న భక్తులు, చౌడేపల్లె: బిల్లేరులో నిర్వహిస్తున్న కల్యాణోత్సవం, వీ.కోట: ఆలయం వద్ద నిర్వహిస్తున్న రామకోటి

గోశాలకు రూ.80 వేల విరాళం



ఈఓకు విరాళమిస్తున్న బాలాజి దంపతులు

చౌడేపల్లె: బోయకొండ గంగాపురంలోని గోశాలకు తిరుపతికి చెందిన బాలాజి దంపతులు ఆదివారం రూ.80 వేల విరాళమిచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. తమ కోర్కెలు ఫలించడంతో కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం బాలాజి దంపతులు ఈ విరాళం అందజేశారని చెప్పారు. పూజల అనంతరం దాతలకు ఈఓ అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు.

భక్తులకు పానకం పంపిణీ

బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చిన భక్తులకు ఆదివారం శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకుని ఈఓ ఏకాంబరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఈతోత్సాహం..!



వేసవిలో రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు వేసవి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు యువకులు గ్రామ సమీపాల్లోని బావులు, చెరువుల్లో ఈత కొడుతున్నారు. బావుల్లో అయితే పై నుంచి జంప్ చేస్తూ కేరింతలు కొడుతున్నారు.

–సదుం

ముత్యాలమ్మకు వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం, చీరను సమర్పిస్తున్న దాతలు

రొంపిచెర్ల: రొంపిచెర్లలోని ముత్యాలమ్మ వారికి బజారువీధికి చెందిన దాతలు వెండి కిరీటం సమర్పించారని ఆలయ అర్చకుడు గుణశేఖర్ ఆదివారం తెలిపారు. తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న సంగి నరసింహులు, చంద్రగిరి మండలం ఎం. కొంగరవారిపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.శిరీష దంపతులు 213 గ్రాములతో తయారు చేసిన రూ.30వేల విలువైన వెండి కిరీటం, చీరను అమ్మవారికి సమర్పించారని, దాతలతో ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలిపారు.

కంటి ఆపరేషన్లకు ఎంపిక



ఆపరేషన్లకు ఎంపికైన వారితో వైద్యాధికారులు

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆదివారం మహతి ఫౌండేషన్ సహకారంతో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 63 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వైద్యాధికారులు రూప, వాసు, ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను ప్రాధేయపడాలా..?

- మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించరా?
- మాల మహానాడు నేతల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

పుంగనూరు: ''ప్రతి నెలా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని తహసీల్దార్‌ను ప్రాధేయపడాలా..? ఆయనకు బాధ్యత లేదా..? మా సమస్యలు పరిష్కరించేదెవరు..? ఏ సమావేశాల్లో చెప్పుకోవాలి..? ప్రభుత్వాదేశాలను ఎందుకు అమలు చేయరు? ఇకనైనా వీటిని నిర్వహించకపోతే తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం'' అని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్ అశోక్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించలేదని, సమస్యలు పరిష్కరించడం లేదని, ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని కోరుతున్నా ఆయనలో చలనం లేదని ఆరోపించారు. అలాగే సమావేశాలకు అన్నిశాఖల అధికారులు రాకపోవడంతో తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో శ్రీనివాసులు, శంకర, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతకు సన్మానం



తులసీనాథం నాయుడిని సన్మానిస్తున్న కాస్ నాయకులు

పలమనేరు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని అందుకున్న స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడిని పట్టణానికి చెందిన కమ్మ అభ్యుదయ సేవా సంఘం(కాస్) ఆదివారం ఘనంగా సన్మానించింది. తెలుగు భాషకు ఆయన చేస్తున్న సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఉగాది పురస్కారంతో గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఇది ఆయనకు మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు. పలువురు కాస్ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా బంగారం అక్రమ రవాణా!

- చెన్నై నుంచి జిల్లాలోకి..ఆపై కర్ణాటకకు చేరుతున్న వైనం
- అక్కడి నుంచి పన్నులు చెల్లించని, బిల్లుల్లేని బంగారు ఇక్కడికి
- ప్రైవేటు వాహనాలు, బస్సుల్లోనే గుట్టుగా రవాణా
- ధర తక్కువ కావడంతో ఎగబడి కొంటున్న వ్యాపారులు
- కొన్నేళ్లుగా రహస్యంగా సాగుతున్న బంగారు రవాణా



పలమనేరు: జిల్లాలోని సరిహద్దు మార్గాల్లో బంగారు అక్రమ రవాణా జోరందుకుంది. వీ.కోట సమీపంలోని నాయకనేరి ఘాట్‌లో మూడున్నర కేజీల బంగారు కడ్డీల దోపిడీ వ్యవహారంలో ఈ విషయం వెలుగుచూసింది. ఏమాత్రం అనుమానం రాకుండా చెన్నై నుంచి గుడియాత్తం, పేర్నంబట్, వీ.కోట మీదుగా జిల్లాతోపాటు కర్ణాటకలోని కేజీఎఫ్, బంగారుపేటకు పన్నులు చెల్లించని బిల్లులు లేని బంగారం అక్రమ రవాణా అవుతున్నట్టు తెలుస్తోంది. చెన్నైలో ఇలాంటి పన్నులు చెల్లించని బంగారాన్ని తరలించే ఏజెంట్లు భారీగా ఉన్నట్టు తెలియవచ్చింది. మార్కెట్ ధరకంటే తక్కువకే బంగారు లభిస్తుండడంతో ఇక్కడి బంగారు వ్యాపారులు రహస్యంగా ఏజెంట్ల నుంచి కొంటున్న వ్యవహారం కొన్నేళ్లుగా సాగుతున్నట్టు సమాచారం.

ఏ మార్గాల్లో అంటే..!

చెన్నై నుంచి గుడియాత్తం మీదుగా పలమనేరు, పేర్నంబట్ మీదుగా వీ.కోట, ఇదే మార్గంలో కర్ణాటకలోని కేజీఎఫ్, బంగారుపేట, వేలూరు మీదుగా చిత్తూరు, తిరుపతి పట్టణాలకు బిల్లులు లేని బంగారం అక్రమ రవాణా సాగుతోంది. అక్కడి ఏజెంట్లు ఏమాత్రం అనుమానం రాకుండా కిలో నుంచి ఐదు కిలోల వరకూ ఆన్‌లైన్ బుకింగ్ బస్సులు, ఆపై ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు మారుతూ ఆర్డర్లున్న ప్రాంతాలకు ఈ బంగారాన్ని చాలా సులభంగా చేరవేస్తుంటారని తెలుస్తోంది. వీ.కోట ఘటనలో సంబంధిత ఏజెంట్‌కు కేజీఎఫ్‌లోని బంగారు వ్యాపారుల మధ్య గొడవ జరగడం వలనే అతను కారులో బంగారాన్ని తెస్తున్నట్టు తెలుస్తోంది. ఏజెంట్ వస్తున్న కారు డ్రైవర్ సమాచారంతోనే కేజీఎఫ్ బంగారు వ్యాపారుల ముఠా ఈ కారును పట్టుకున్నట్టు తెలిసింది.

వందలాది రాజస్థానీ మార్వాడీ సేట్ల బంగారు దుకాణాలు

జిల్లాలోని వీ.కోట, పలమనేరు, బంగారుపాళెం, బైరెడ్డిపల్లె, చిత్తూరు, కర్ణాటకలోని కేజీఎఫ్, బంగారుపేటలలో వందలాది మంది రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ బంగారు దుకాణాలను నడిపే వ్యాపారులున్నారు. వీరికి చెన్నై ఏజెంట్ల నుంచి పన్నులు లేని బంగారు చేరడంతో ఆపై వారు దీనిని నగలుగా తయారు చేసి విక్రయాలు చేస్తుంటారు. ఇందులో వ్యాపారులకు మంచిలాభం ఉండడంతో వీరి వ్యాపారులు ఇక్కడ జోరందుకున్నాయి. పదేళ్ల క్రితం ఈ ప్రాంతంలో నాలుగైదు బంగారు దుకాణాలుండగా ఇప్పుడు వాటి సంఖ్య వందకు దాటిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

బంగారు వ్యాపారుల గుండెల్లో రైళ్లు

వీ.కోట పోలీసులకు పట్టుబడిన కేజీఎఫ్ ముఠా, చెన్నై ఏజెంట్ల ద్వారా పన్నులు చెల్లించని బంగారం అక్రమ రవాణా గుట్టురట్టైంది. దీంతో ఈ ప్రాంతంలో ఇప్పటి వరకూ ఏఏ దుకాణాలకు బంగారాన్ని సరఫరా చేశారో పోలీసులకు సమాచారం రాబట్టినట్టు తెలుస్తోంది. దీంతో ఈ ప్రాంతంలోని బంగారు వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. త్వరలో ఇంకెమంది వ్యాపారులు ఈ వ్యవహారంలో పట్టుబడతారో వేచి చూడాల్సిందే!

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం గుంటూరుకు చెందిన రాధాకుమారి, శివప్రసాద్ రూ.ఒక లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ నగదు స్వీకరించిన ఆలయ అధికారులు దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.